ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



జూన్ 24 నుంచి
## పార్లమెంట్ సమావేశాలు
సభ్యుల ప్రమాణం..
కొత్త స్పీకర్ ఎంపిక
2లో..

సంపుటి: 2 | సంచిక: 62 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 12 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### భారత ఆర్థిక పురోభివృద్ధిలో
# యువతదే కీలకపాత్ర
### తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్
### ఘనంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం




ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణ న్




స్నాతకు ఉత్సవంలో గవర్నర్ రాధాకృష్ణన్

ములుగు, జూన్11(ప్రభాత ఉదయం) 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ, జారండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు లో మంగళవారం జరిగిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ... భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉ ద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉ దాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత అలాగే పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూపర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి అన్నారు. స్నాతకోత్వానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.... ప్రెసిషన్ ఫామింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేదస్సు, రోబోట్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందని ఆమె అన్నారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో, పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలని అన్నారు. స్పీడ్ బ్రేకింగ్ ఉ ంటాయి ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడు సంవత్సరాల్లోనే పూర్తవుతుంది అన్నారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని డాక్టర్ గీతా లక్ష్మి పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలని నైపుణ్యభారత్ కు సైతం ఇది దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. కష్టపడే లక్షణం విద్యార్థులు అలవర్చుకుంటే విజయం తప్పక వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉ ద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం, అలాగే అభివృద్ధి నివేదికను గవర్నర్ కు విన్నవించారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన ..మిగతా 2లో



### విద్యుత్ కొనుగోలు వివాదంపై
# కేసీఆర్‌కు నోటీసులు

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): తెలంగాణలో విద్యుత్ కొనుగోలు అంశం పెను దుమారాన్ని రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. ఇందుకోసం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన విద్యుత్ కాంట్రాక్టుల లోటును తీర్చాలని ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ మాజీ ముఖ్యమంత్రికి నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన విద్యుత్ ఒప్పందాల్లో తన పాత్రను తెలియజేయాలని ఆ నోటీసుల్లో కమిషన్ కోరింది. విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో తన పాత్రను వివరించాలని పేర్కొంది. విద్యుత్ కమిషన్ నోటీసుల ప్రకారం జూన్ 15లోగా సమాధానం ఇవ్వాలని కోరింది.అయితే సమాధానం ఇచ్చేందుకు జూలై 30 వరకు సమయం కావాలని కేసీఆర్ కోరినట్లు సమాచారం. అలా అయితే కేసీఆర్ ఇచ్చే వివరణను బట్టి అక్కడ నేరుగా విచారణకు అవకాశం ఉంది. ఆయన సమాధానం సంతృప్తికరంగా లేకుంటే విద్యుత్ కమిషన్ నేరుగా విచారణకు దిగుతామని సంకేతాలిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో న్యాయ కమిషన్‌ను నియమించింది. ఈ ..మిగతా 2లో

# మంత్రులకు ల్యాండ్ క్రూజర్స్
2

### ఫోన్ ట్యాపింగ్ కేసులో
# ఛార్జిషీటు దాఖలు


2

### కారుణ్య నియామక వయస్సు
# 40 ఏళ్లకు పెంపు

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. వారసుల గరిష్ఠ వయోపరిమితిని 35 ఏండ్ల నుంచి 40 ఏండ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని 2018 మార్చి 9వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు సింగరేణి వెల్లడించింది.






# జూరాలకు జలకళ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)సాగు, తాగునీటి కోసం గత యాసంగిలో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డ నడిగడ్డ ప్రజలకు వరుణదేవుడి కరుణతో ముందస్తు వర్షాలు మురిపించాయి. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు కృష్ణా ణపరివాహక ప్రాంతాలు, జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు వచ్చి నీరు చేరుతుండడంతో రోజు రోజుకూ ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. మంగళవారం జూరాల జలాశయానికి ఎగువ ప్రాంతం నుండి 7,211 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో జూరాల జలాశయంలో 5.547 టిఎంసిల నీరు నిల్వ ఉంది. దీంతో ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుండి వరద రాకున్నప్పటికీ వర్షపు నీరు చేరికతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువవుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టిఎంసిలకు గాను 5.547 టిఎంసిలు నీరు చేరడంతో మరో వారంలోగా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని అధికారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేసేందుకు సన్నద్ధమవుతుండగా తాజాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి కూడా నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అదే విధంగా ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టిఎంసిలకు గాను 22.51 టిఎంసిల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయంలో 37.646 టిఎంసిలకు గాను 24.36 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జూరాలకు ముందస్తుగా వర్షపు చేరికతో పూర్తి స్థాయి మట్టానికి చేరుకుంటుండడంతో ఆయకట్టు రైతులు ముందస్తు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

# నేటినుంచి స్కూళ్ల ప్రారంభం
### అమ్మ ఆదర్శ పాఠశాలలతో ఉత్తమ విద్య
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 11 (ప్రభాత ఉదయం): పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

# విచారణకు హాజరైన వారంతా అఫిడవిట్లు ఇవ్వాలి
### కాళేశ్వరం కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ వెల్లడి



హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): ఈ నెల 25వ తేదీలోపు తమ విచారణకు హాజరైన వారందరూ అఫిడవిట్లు ఫైల్ చేయాలని, తప్పుడు అఫిడవిట్లు ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాళేశ్వరం కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ చెప్పారు. మంగళవారం ఆయన జలసౌధలో మీడియాతో చిట్ చాట్ చేశారు. తాజాగా 20 మందితో సమావేశమైనట్టు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన, తెలిసిన అంశాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని చెప్పామని అన్నారు. రెండురోజుల పాటు ఇంజినీర్లతో సమావేశమైనట్టు ..మిగతా 2లో

# భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

మొదటి పేజీ తరువాయి...

విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందని, అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలనగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపు తోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్ పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి ఆమె తెలిపారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన ఉద్యాన దర్శిని ప్రచురణతో పాటు గ్రామాల దత్తత, విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అంద అందజేస్తున్నట్లు డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు.

### విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానం

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్ లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్ కు చెందిన ఆర్. వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బిఎస్సి హానర్స్ ఫారెస్ట్రీలో పిసిసిఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళిబీ డీన్స్ గోల్డ్ మెడల్ కె. ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్ లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఎస్కేఎల్ టి ఎస్ హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జిఎస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.




సర్టిఫికెట్లు స్వీకరించిన విద్యార్థులతో ఛాన్సలర్ రాధాకృష్ణన్, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి గీతా లక్ష్మీ, తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్

### విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డ్ డాక్టరేట్ పట్టాలు ప్రధానం . కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డిఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథూర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




# జూన్ 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు

## సభ్యుల ప్రమాణం.. కొత్త స్పీకర్ ఎంపిక

న్యూఢిల్లీ, జూన్ 11 (ప్రభాత ఉదయం): కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వేళ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించేందుకు కసరత్తు మొదలయ్యింది. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అంతకంటే ముందుగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. వీటికోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు వీటిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 24-25 తేదీల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, జూన్ 26న స్పీకర్ ఎన్నిక ఉండొచ్చని సమాచారం. ఈ సమయంలో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఆసక్తిగా మారింది. మోదీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న తెదేపా, జేడీయూ ఆ పదవిని ఆశించినట్లు వార్తలు వచ్చాయి. ఇండియా కూటమి పార్టీలు సైతం స్పీకర్ పోస్టుకు పట్టుబట్టాలని వీరిపై ఒత్తిడి తేవడం గమనార్హం. మరోపక్క, రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది.




# మంత్రులకు ల్యాండ్ క్రూజర్స్

## విజయవాడలో దాచిన ల్యాండ్ క్రూజర్లు త్వరలో రాక.. ఎవరికి కేటాయిస్తున్నారంటే..?

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): తెలంగాణ మంత్రులకు త్వరలో ల్యాండ్ క్రూజర్ వాహనాలు రానున్నాయి. అయితే ఈ వాహనాల కొనుగోలుకు సంబంధించి గత కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో రకరకాల ట్రోలింగ్‌లు చేస్తున్నారు. అసలు డబ్బులు లేవు అని చెప్తున్న రాష్ట్ర సర్కార్ ఖరీదైన ల్యాండ్ యూజర్ వాహనాలను ఎలా కొనుగోలు చేస్తోందంటూ ప్రశ్నల వర్షం కురిపించారు నెటిజన్లు. వీరందరంకీ షాక్ ఇస్తూ, వాహనాల కొనుగోలుకు సంబంధించి కాంగ్రెస్ సర్కార్ క్లారిటీ ఇచ్చింది. అసలు ఈ వాహనాలను కొత్తగా కొనుగోలు చేసినవి కాదంటూ రేవంత్ సర్కార్ తేల్చి చెప్పింది. వీటిని గత ప్రభుత్వ హయాంలోనే 22 వాహనాలను కొనుగోలు చేసి సంవత్సరం పాటు విజయవాడలో దాచి పెట్టిందని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తుంది. ఒక్కొక్క వాహనానికి మూడు కోట్ల రూపాయలు చెల్లించి గతి ప్రభుత్వ హయాంలోనే 22 వాహనాలను కొనుగోలు చేశారు. 22 ల్యాండ్ క్రూజర్ వాహనాలను కొనుగోలు చేసి వాటిని చాలా కాలం పాటు విజయవాడలోనే ఉంచారు. ఇలాంటి క్రూజ్ వాహనాలకు బుల్లెట్ ప్రూఫ్ కోసం ఏడాది పాటు సమయం తీసుకున్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అనుకున్న గత ప్రభుత్వం వీటికి బుల్లెట్ ప్రూఫ్ జోడించారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వీటిని వాడాలని నిర్ణయించుకున్నారు. కానీ పరిస్థితులు అనుకూలించక కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. దీంతో ఇప్పుడు ఇదే వాహనాలను తెలంగాణ మంత్రులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎలాంటి వాహనాల కొనుగోలను చేపట్టలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఖరీదైన ల్యాండ్ క్రూజ్ వాహనాలు మొత్తం గత ప్రభుత్వ హయాంలోనే కొనుగోలు చేసి వాటిని విజయవాడలో పెట్టారని క్లారిటీ ఇచ్చింది. గతంలో ఇదే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సైతం స్పందించారు. తను అధికారంలోకి వచ్చిన పది రోజులకే అధికారులు తన దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చినట్టు రేవంత్ తెలిపాడు. సీఎం రేవంత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన పాత వాహనాలని రిపేర్ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆ సమయంలోనే గత ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ 22 ల్యాండ్ క్రూజర్ వాహనాల గురించి తనకు తెలిసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఇదే వాహనాలను తెలంగాణ మంత్రులకు ఇవ్వనున్నారు. అయితే ఈ విషయం తెలియక సోషల్ మీడియాలో పలువురు కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ వాహనాలను కొనుగోలు చేసినట్టు దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సర్కార్ మండిపడింది. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్న ఇలాంటి వాహనాలను కొనుగోలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు నెటిజన్లు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. 22 వాహనాలకు గాను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదివరకే దాదాపు 70 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినట్లు స్పష్టం చేసింది.

# నేటినుంచి స్కూళ్లే ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు నీటి సరఫరా అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు' అని హెచ్చరించారు.



# విద్యుత్ కొనుగోలు వివాదంపై కేసీఆర్‌కు నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

క్రమంలో కమిషన్ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. గత రెండు రోజులుగా బీఆర్ఎస్ హయాంలో పనిచేసిన కొందరు అధికారులను విచారణకు పిలిచి పలు కీలక అంశాలపై ప్రశ్నించారు. నిన్న మాజీ సీఎండీ ప్రభాకర్ రావును విచారించిన జస్టిస్ నరసింహారెడ్డి ఇవాళ మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు పంపడం గమనార్హం. కాగా విద్యుత్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మూడు అంశాలపై విచారణ కొనసాగుతోందన్నారు. ఛత్తీస్ ఘడ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్స్ పై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయన్నారు. 25 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదు.. టైం అడిగారన్నారు. మాజీ సీఎండీ, ఇప్పుడున్న సీఎండీ తో సమావేశం జరిపామన్నారు. నిన్న మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, అప్పటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందా తో సమావేశమయ్యామని తెలిపారు. మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందన్నారు. జెన్కోలకు సంబంధం లేదన్నారు. ఎస్ కే. జోషి, అరవింద్ కుమార్‌తో సమావేశం అయ్యామన్నారు. అరవింద్ కుమార్ అప్పుడే రెగ్యులేటరి కమిషన్ కు లేఖ రాసిన పట్టించుకోలేదన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలన్నారు. రెండు రాష్ట్రాల ఒప్పందం తో ఛత్తీస్ ఘడ్ కు అధికారం ఇచ్చారన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని తెలిపారు. మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాలన్నారు. భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారు..అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారన్నారు. యాదాద్రిలో నామినేషన్ బేస్ లో ఇచ్చారని తెలిపారు. ఇంకా పూర్తి కాలేదని, ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి అంటున్నారు కానీ రైల్వే లైన్ వెయ్యలేదన్నారు. అధికారుల నుంచే కాదు ప్రముఖులు నుంచి సమాచారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# విచారణకు హాజరైన వారంతా అఫిడవిట్లు ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. రేపటి నుంచి ఏం చేయాలనేదానిపై జాబితాను సిద్ధం చేస్తామని అన్నారు. త్వరలో నిర్మాణ సంస్థలనూ విచారణకు పిలుస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికారుల పేర్లు ఉంటే వారికి కూడా నోటీసులు ఇస్తామని ఘోష్ వెల్లడించారు. బ్యారేజీలు సరిగా పనిచేస్తే ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని అన్నారు. ఎక్కడో ఏదో తప్పుడు లెక్కల వల్ల ఇలా జరిగినట్టు అనిపిస్తోందని తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీటు దాఖలు

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు. ఛార్జిషీట్‌లో ఆరుగురిని నిందితులుగా పేర్కొన్నారు. మరో వైపు అడిషినల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి కావడంతో బుధవారం తీర్పు వెల్లడించనున్నట్టు నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది.




# నేడు టెట్ ఫలితాల విడుదల

## అధికారిక వెబ్‌సైట్లో పెట్టనున్న విద్యాశాఖ

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫలితాలు జూన్ 12న బుధవారం విడుదల కానున్నాయి. టీచర్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు టెట్ ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టెట్ రాసిన అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో మే 20 నుంచి జూన 2 వరకు టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటి సారిసగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్షలు నిర్వహించారు. టెట్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని జూన్ 3న అధికారులు విడుదల చేశారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తుది ఆన్సర్ కీని రూపొందించింది. జూన్ 12న ÷నైల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి టెట్ పరీక్షలకు మొత్తం 2,86,381 దరఖాస్తు చేసుకోగా.. వారిలో పరీక్షలకు 2,36,487 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో పేపర్-1 పరీక్షకు మొత్తం 99,958 మంది దరఖాస్తు చేసుకోగా 86.03 శాతం మంది హాజరయ్యారు. అదేవిధంగా పేపర్-2 పరీక్షకు 1,86,423 మంది దరఖాస్తులు చేసుకోగా.. 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. డీఎస్సీ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండటంతో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు టెట్ పరీక్షకు ప్రాధాన్యమిస్తారు. అలాగే ప్రభుత్వ టీచర్ పోస్టుల నియామకాలకు నిర్వహించే టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) రాసేందుకు టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుంది. కాబట్టి బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు టెట్ పరీక్షలో మంచి స్కోర్ సాధించేందుకు పోటీపడు తుంటారు. టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 40 శాతంగా నిర్ణయించారు.మరోవైపు టెట్ ఫలితాలను వెల్లడించనుండగా.. తెలంగాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 దరఖాస్తు పక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తు పక్రియ మార్చి 4న ప్రారంభంకాగా... డీఎస్సీకి ముందు టెట్ నిర్వహణ తప్పనిసరి అని కోర్టు ఆదేశించడంతో ఏప్రిల్ 2తో ముగియాల్సిన గడువును జూన్ 20 వరకు పొడిగించారు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 17 నుంచి 31 వరకు టీఎస్ డీఎస్సీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా 37,700 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 2.14 లక్షల మంది వరకు దరఖాస్తులు సమర్పించారు. జూన్ 12న టెట్ ఫలితాలు వెలువడితే.. డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకునేవారిక సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# ఎన్‌డిఎ భేటీలో అరుదైన సంఘటన

### 1995లో చంద్రబాబు పేరును ప్రతిపాదించిన దగ్గుబాటి

### ఇప్పుడు సిఎంగ చంద్రబాబను బలపర్చిన సతీమణి పురందేశ్వరి

అమరావతి, జూన్ 11 (ప్రభాత ఉదయం): ఎన్‌డిఎ కూటమి శాసనసభ పక్ష సమావేశంలో అరుదైన ఘటన చోటు చేసుకుంది. 1995లో తొలిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో తెలుగుదేశం శాసనసభ పక్ష సమావేశంలో తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వర రావు ప్రతిపాదించారు. 29 ఏళ్ల తర్వాత జరిగిన కూటమి శాసనసభ పక్ష సమావేశంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేరును దగ్గుబాటి వెంకటేశ్వరరావు సతీమణి, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి బలపరిచారు. 95 నాటి పరిణామాలను మరోసారి టీడీపీ నేతలు ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో అంతకు ముందు కూడా ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో కూటమి పార్టీలు అంతా సమానమేననే సంకేతాలను చంద్రబాబు ఇవ్వడం జరిగింది. సిబ్బంది తన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కుర్చీని తొలగించి అందరితో సమానమైన కుర్చీ తీసుకు రమ్మని చంద్రబాబు చెప్పారు. కూటమి అధినేతలు కూర్చున్నటువంటి కుర్చీనే తెప్పించుకొని అందరితో కలిసి చంద్రబాబు కూర్చొన్నారు. కూటమి పార్టీలు, నాయకులు, కార్యకర్తలు అందరూ ఇదే స్ఫూర్తి తో పనిచేయాలని తన చర్యలు ద్వారా సందేశం పంపారు. ఇది మంచి పరిణామం అంటూ కూటమి నేతలు అన్నారు.

# గర్భిణి మృతిపై విచారణ




## ప్రవేటు ఆసుపత్రిలో అకస్మిక తనిఖీలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ గర్భిణి మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ శశికళ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.కె సిద్ధప్ప గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర మదర్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ నెల 8న మృతి చెందిన కుర్వపల్లి గ్రామానికి గర్భిణీ స్త్రీ శివలీలకు సంబంధించిన ఐపి రిజిస్టర్, ఓటి రిజిస్టర్ , ల్యాబ్ రిపోర్ట్స్, స్కానింగ్ రిపోర్ట్స్, సి - సెక్షన్ రిజిస్టర్ డెలివరీ రిజిస్టర్ తనిఖీ చేసి రికార్డులను, రిపోర్టులను హ్యాండ్ ఓవర్ చేసుకున్నారు. అనంతరం ఈ కేసుకు సంబంధించిన రిపోర్టును జిల్లా కలెక్టర్ కు నివేధిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా చింతలపేట లోని సూరజ్ క్లీనిక్ ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సమయంలో ఈ క్లినిక్ నందు క్వాలిఫైడ్ డాక్టర్ కాకుండా ఇతర వ్యక్తులు రోగులకు చికిత్సలు అందిస్తున్నందువల్ల ఈ క్లినిక్ కి నోటీసు అందజేశారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు ఇంచార్జ్ - డిప్యూటీ డెమో కే.మధుసూదన్ రెడ్డి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ ఇన్చార్జ్ జి. నరసయ్య పాల్గొన్నారు.



పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం అయిన డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

## బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి

### డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

బుద్వేల్, జూన్11(ప్రభాత ఉదయం) : బక్రీద్ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ లో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ అన్నారు . ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా నిర్వహించాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలపై మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సులేమాన్ నగర్ , శాస్త్రి పురం డివిజన్ లలో జంతు కళేబరాలను బహిరంగ ప్రదేశాలలో, రోడ్ల పైన పడేయకుండా అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి, వారికి రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి అందజేసిన బ్లాక్ కవర్స్ లలో వేసి స్వచ్ఛ ఆటోలోకి ఇచ్చేటట్లు చూడాలన్నారు. మైలార్ దేవుపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్ లలో సైతం ప్రజలకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. సర్కిల్ పరిధిలో ఎన్ని టిప్పర్లు కావాలి... ఎన్ని జేసీబీ లు కావాలి అంచనా వేసి తెలిపినట్లైతే వాటిని సమకూర్చడం జరుగుతుందన్నారు. ప్రతి వీధికి బ్లాక్ కవర్స్ అందజేయాలని సూచించారు. పరిసరాలు బాగున్నప్పుడే మనం బాగుంటాం అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్వైజర్లు కృష్ణ కిషోర్, ప్రవీణ్, కామేష్ , ఎస్ వీరాంజనేయులు , యేసు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనంపల్లి జైపాల్ రెడ్డి, తదితరులు

## గృహ జ్యోతి పథకం వెంటనే అమలు చేయాలి: సీపీఐ డిమాండ్

బుద్వేల్, జూన్11(ప్రభాత ఉదయం): గృహ జ్యోతి పథకాన్ని అమలు చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాజేంద్రనగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే గృహజ్యోతి పథకం అమలు చేస్తామని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. గృహ జ్యోతి పథకం క్రింద వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో క్రింద బిల్లులు అమలు చేయాలి అన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారని, రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రేటర్ పరిధిలో వచ్చే అని డివిజన్ లలో కూడా అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలు, మహిళలకు రూ. 2500లు , గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇంకా అనేకమైనటువంటి హామీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇచ్చినటువంటి అన్ని హామీలను అమలు చేయాలన్నారు. అమలు చేయకుంటే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు ఇ.నిరంజన్ గౌడ్, జి.సత్యం పాల్గొన్నారు.



విద్యార్థులు

## నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

బుద్వేల్, జూన్11(ప్రభాత ఉదయం):నేటి (బుధవారం) నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో అన్ని సౌకర్యాలను కల్పించారు. 48 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులందరు ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. నూతన తరగతిలో చేదడానికి కావలసిన పుస్తకాలు , బ్యాగులు, స్కూల్ డ్రెస్ లు కొనుగోలు చేసి ఉత్సాహంగా స్కూల్ కి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో నూతన విద్యార్థులను చేర్చుకునేలా ఉపాధ్యాయులు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు . విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో పాఠశాలలో చేర్చుకునేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. బడిబాట ద్వారా పాఠశాల బయట ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు గల పిల్లలందరూ పాఠశాలలో ఉండి చదువుకునేలా ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారు.



## క్రీడలు యువతి యువకుల్లో క్రమశిక్షణ పెంపొందిస్తాయి

### బిజెపి నాయకుడు ప్రేమ్ రాజ్

శంషాబాద్, జూన్ 11( ప్రభాత ఉదయం) క్రీడలు యువతి యువకుల్లో క్రమశిక్షణను పెంపొందిస్థాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ అన్నారు . శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండపల్లి బిజెపి నాయకుడు కొండా పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీఎస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. మున్సిపల్ బిజెపి నాయకుడు. కొండ పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ప్రేమ రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం జరిగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కప్పును కొండ పరమేష్ గౌడ్. డాక్టర్ ప్రేమ్ రాజ్ అందజేశారు. మునిసిపల్ బిజెపి అధ్యక్షుడు దేవేందర్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి. స్థానిక నాయకులు పెదిరిపాటి శేఖర్ గౌడ్. దొడ్డ పెంటయ్య. సుఖేందర్. సుదర్శన్ రెడ్డి. అఖిల్. రాజు. చంటి. దామోదర్. అరుణ్. తదితరులు పాల్గొన్నారు. ఫైనల్ లొ శంషాబాద్ టీం తో %శీ%డుపల్లి టీం తలపడడం జరిగింది. ఫైనల్లో శంషాబాద్ టీం కెప్టెన్ సుజిత్ జట్టు మ్యాచ్ విన్ అయింది తొండపల్లి టీం కెప్టెన్ రాజు సచిన్ వైస్ కెప్టెన్ క్యామ మహేష్ రన్నర్ అఫ్ గా నిలిచింద విన్నర్ టీం కి గోల్డెన్ కప్ అందజేయడం జరిగింది తొండుపల్లి టీం కి రన్నర్ కప్ అందజేయడం జరిగింది.



## క్రిష్ణా నదిలో పెరిగిన వరద

### హెచ్చరించిన పుట్టిల ద్వార జనం చేరవేత

మక్తల్,జూన్ 11(ప్రభాత ఉదయం)క్రిష్ణా నదిలొ వరద నీటితో నీటిమట్టం పెరిగి బండరాళ్లు మునిగి నది రెండు వైపుల (దారులు) అంచులు కలసి పారుతు వరద నీరు దిగువ జూరాల ప్రాజెక్టు వైపు పరుగెడుతున్నాయి. హెచ్చరికలు ఉన్నా వరద నీటిలో పుట్టిల ద్వార ప్రయాణీకులను చేర వేస్తున్నారు. గత వారం రోజులుగా కర్నాటక లో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఎగువ భాగమున బారిగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు నదిలో చేరడం వల్లా క్రిష్ణమ్మ వరద పెరిగింది. ఈ వరద కారణంగా దిగువన ఉన్న రోడ్డు కం బ్యారేజిలు నీటి మట్టం పెరిగ్గా వచ్చిన వరద నీరు దిగువకు వదిలేందుకు షట్టర్లు పైకెత్తెందు కు ప్రయత్నించగా మొరాయించిన సంఘటనలు ఉన్నాయి, కర్ణాటక నుండి తెలంగాణ రాష్ట్రంలో మక్తల్ నియోజక వర్గంలో క్రిష్ణా నది ప్రవేశించడంతో కృష్ణ, మాగనూరు, మక్తల్ మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతం గ్రామాల్లో ముందుస్తుగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు హెచ్చరి కలు జాగ్రత్తలను తీసుకున్నారు. అయితే కృష్ణ నదిలో వరద ఉన్నా కూడా నదిలో కర్నాటక తెలంగాణ మక్తల్ మండలంలోని పస్పుల,పాటి గ్రామాల పరివాహక సరిహద్దు ప్రజలను పుట్టిలో ప్రజలను అటు ఇటు చేరవేస్తున్నారు.

## సమాచార కమిషనర్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 29లోపు దరఖాస్తులు పంపించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ సమాచార కమిషనర్ల నియామకానికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు.



ఎంపీ రఘునందన్ రావుకు పుష్ప గుచ్చం అందజేస్తున్న బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి

## ఎయిర్ పోర్టులో రఘునందన్ రావుకు ఘన స్వాగతం

శంషాబాద్,జూన్ 11 (ప్రభాత ఉదయం) మంగళవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుకు ఘన స్వాగతం లభించింది. రఘునందన్ రావు మెదక్ ఎంపీగా గెలిచిన తర్వాత మొదటి సారిగా ఢిల్లీ నుండి హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా రఘునందన్ రావు కు బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్. బండి శీను. శ్రీకాంత్. లింగం మహేష్. భరత్. సాయి. ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## ఒడిషా సిఎంగా మోహన్ చరణ్ మాఝీ ఎంపిక



భువనేశ్వర్, జూన్ 11 (ప్రభాత ఉదయం): ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ ఎంపికయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిదా లకు అవకాశం లభించింది. మాఝీని బీజేపీ శాసనసభా పక్ష నేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మోహన్ మాఝీ కియోంజర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. వీరు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ , బీజేపీ అగ్రనేతలు, పార్టీ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 147 స్థానాలకు గాను 78 సీట్లు గెలుచుకుని తొలిసారిగా రాష్ట్రంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చింది. 2000, 2004లో బీజేడీ కూటమి భాగస్వామిగా బీజేపీ రాష్టాన్ని పాలించింది.

## తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీలో ఘోరం

### విమాన ప్రమాదంలో ఉపాధ్యక్షుడు దుర్మరణం

### భార్య సహా..తొమ్మిదిమంది మృత్యువాత



న్యూఢిల్లీ, జూన్ 11 (ప్రభాత ఉదయం): తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారం నాడు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదాకరమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు. ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలను గుర్తించామని.. అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబంధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయాన్ని కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయెల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

# ఫిట్నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

## రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా ఫిట్ నెస్ లేకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సులను గుర్తించి వాటిని వెంటనే సీజ్ చేసి, నూతన బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్- రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పేరు సుభాన్,పవన్, పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి హలీంపాషా, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫిట్ నెస్ లేని బస్సులను గుర్తించి సీజ్ చేయాలని మంగళవారం జిల్లా రవాణ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం మే 15లోగా స్కూల్ బస్సులకు ఫిట్ నెస్ చేయించాల్సి ఉండగా స్కూల్స్ యాజమాన్యం గడువు దాటినప్పటికి పూర్తిస్థాయిలో బస్సులకు సామర్థ్య ఫిట్నెస్ పరీక్షలు చేయించని పరిస్థితి నేడు జిల్లాలో కనిపిస్తుందని అన్నారు. కావున ఫిట్నెస్ లేని బస్సు లకు ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేయవద్దని కోరారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ బస్సులు ఫిట్ నెస్ లేకుండా తిరుగుతున్నాయని, అనుభవం లేని, లైసెన్స్ లేని డ్రైవర్లచే బస్సులను నడిపించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురై అవకాశాలున్నాయన్నారు. స్కూల్ బస్ లలో ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మిడిల్ రాడ్స్, విండోస్ దగ్గర సైడులకు జాలి లేకుండానే పాత బస్ లకు కొత్త రంగులు అద్ది ఫిట్నెస్ తేవడం కోసం విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థి, తల్లితండ్రులను, అధికారులను మభ్యపెడుతున్నారాని వారి పై వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అధికారులు దీనిపై దృష్టి సారించి ముందస్తుగా అప్రమత్తత పాటించాలని, ఫిట్ నెస్ లేకుండా సరైన నిబంధనలు పాటించని, బస్సులను సీజ్ చేయాలని అలా బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



## ప్రతి పౌరుడు గర్వంగా తలెత్తుకునేలా మోడీ సర్కార్ కృషి చేస్తుంది

### దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేసత్తా మోడీకి ఉంది జీడిమడ్ల హరిప్రసాద్

కూకట్‌పల్లి, జూన్ 11 (ప్రభాత ఉదయం) ప్రతి పౌరుడు గర్వంగా తలెత్తుకునేలా చేసే సత్తా ఒక మోడీ మాత్రమే ఉందని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు జీడిమడ్ల హరిప్రసాద్ అన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన పర్వాన్ని పురస్కరించుకొని ఫతేనగర్ డివిజన్ లో ప్రజలు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెద్ద ఎత్తున సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ ఈ హ్యాట్రిక్ విజయం వెనుక ప్రతి ఒక్క ఓటరు ఆకాంక్ష, నమ్మకం దాగి ఉందని అన్నారు. ఇచ్చిన మాట తప్పని మోడీ సర్కార్ ప్రతి హామీని నెరవేరుస్తుందని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేయడం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు గర్వంగా తలెత్తుకొని బ్రతికేలా చేసేందుకు ఏ అవకాశాన్ని వదలకుండా మోడీ సర్కార్ కృషి చేస్తుందన్నారు. ప్రతి భారతీయుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటుందని, ఈ ఆనంద సమయాన్ని పురస్కరించుకొని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోడీ కి, దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములై భారత్ ను విశ్వ గురువుగా చేసే మోడీ సర్కార్ సంకల్పంలో కేబినెట్ మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## లక్కీ డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులు ఉచితంగా చదివేందుకు నిబంధనల ప్రకారం లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో నిర్దేశించిన ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరేందుకు 57 సీట్లు (నాన్ రెసిడెన్షియల్), ఐదో తరగతిలో చేరేందుకు 59 సీట్లు (రెసిడెన్షియల్) కేటాయించగా మొత్తం 833 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 33% రిజర్వేషన్లు బాలికలకు కేటాయించగా, మిగిలిన సీట్లను జనరల్ కోటాలో లక్కిడిప్ తీసినట్లు చెప్పారు. అదేవిధంగా ఆయా తరగతిలో రిజర్వేషన్లు ఉన్న బాలికలు, జనరల్ కోటాలో పది మంది చొప్పున అదనంగా వెయిటింగ్ లిస్టులో ఉంచేందుకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఆయా తరగతుల్లో చేరకుంటే ప్రాధాన్య క్రమంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లు కేటాయిస్తామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారిని శ్వేతా ప్రియదర్శిని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 12న తమ దృవపత్రాలను తీసుకొని ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్.సి కార్పోరేషన్ ఈడీ రమేష్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారిని ఇందిర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## చెకింగ్ కాని సి.యు.లు, బి.యు.లు, వివి ప్యాట్లు హైదరాబాద్‌కు తరలింపు


గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గద్వాల్ , అలంపూర్ సెగ్మెంట్లకు సంబంధించిన సి - కేటగిరి మరియు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కాని సి.యు.లు, బి.యు.లు, వివి ప్యాట్లను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో భద్రంగా ఈ.సి.ఐ.ఎల్ ,ఈ.ఎస్.ఎం.డి హైదరాబాద్ కు మంగళవారం తరలించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ ( స్తానిక సంస్థలు ) అపూర్వ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సి - సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ , ఎన్నికల సిబ్బంది , వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మణికొండలో కారు బీభత్సం

### పార్కింగ్ చేసిన బైక్‌లపై దూసుకెళ్లిన మైనర్ బాలుడు

రాజేంద్రనగర్,జూన్11(ప్రభాత ఉదయం) నగర శివారు రాజేంద్రనగర్ మణికొండలో కారు బీభత్సం సృష్టించింది.గోల్డెన్ టెంపుల్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన బైకులపైకి దూసుకెళ్లింది.దీంతో అక్కడ నిల్చున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.అయితే కారు ఆగకుండా వెళ్లడంతో స్థానికులు వెంబడించి పట్టుకున్నారు.ఈ సందర్భంగా కారును నడుపుతున్నదని మైనర్ బాలుడిగా గుర్తించారు.పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు.కారును సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.కారు ఢీకొనడంతో 20 బైకులు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.




నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

## ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చర్యలు చేపట్టాలి

### జిహెచ్ఎంసి మేయర్‌కు వినతి పత్రం అందించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 11 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజక వర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ డెవలప్మెంట్ విషయమై మంగళవారం జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో ఉన్న మట్టి కుప్పలు తొలగించి, కాలనీకి అవసమైన అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి పత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందించిన మేయర్ అతిత్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి, జూన్ 11 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా మాజీ కార్పొరేటర్ దండమూడి శోభనాద్రి వర్ధంతి వేడుకలు

కూకట్‌పల్లి, జూన్ 11 (ప్రభాత ఉదయం) కే పి హెచ్ బి డివిజన్ మాజీ కార్పోరేటర్ స్వర్గీయ దండమూడి శోభనాద్రి వర్ధంతిని పురస్కరించుకొని, కే పి హెచ్ బి డివిజన్ తెదేపా సీనియర్ నాయకులు అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో జే ఎన్ టి యు సర్కిల్ ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు షేక్ సత్తార్, చంద్రరావు, జాస్తి రమాదేవి, చిరుమామిళ్ళ ఉమ, సుబ్బారావు, చెరుకూరి రవి, కొల్లూరి శ్రీనివాస్, కాకర్ల గోపికృష్ణ, పవన్ మూర్తి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ కే చౌదరి, హేమంత్, రాయుడు, వినయ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కమిటీ వెయ్యాలి

### డాక్టర్. ప్రేమ్ కుమార్



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(ప్రభాత ఉదయం)నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాలపై కమిటీ వెయ్యాలని డాక్టర్. ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ..ఎంతో మంది కష్టపడీ చదివి రాసిన నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాల పై విచారణ కమిటీ నియమించాలన్నారు...ఒకే సెంటర్ లో ఎగ్జామ్ రాసిన విద్యార్తులందరికీ టాప్ ర్యాంక్ లు రావడం ,అనుమానాలకు తావిస్తుంది,ఇలా జరగడం కష్టపడిన విద్యార్థుల శ్రమ ను దొచుకోవడమే అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్య ను వ్యాపారంగా మార్చి కోట్లు, కోట్లు సంపాదిస్తూ విద్యార్తుల జీవితాలతో ఆడుకుంటున్నయని.. విద్యార్థుల శ్రమను, జ్ఞానం ను, కాలాన్ని వారి జీవితాల్ని కార్పొరేట్ విద్యసంస్థలు నాశనం చేశాయని, విద్యార్థుల కు జ్ఞానం కాకుండా.. మార్కులు సంపాదించే మర యంత్రాలు గా తయారు చేస్తున్న..ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా సంస్థల ను నిరోధించకపోతే... కార్పొరేట్ విద్యా మాఫియా గా తయారు అవుతుందని, నీట్ ఎగ్జామ్ విషయం లో విద్యార్థులకు, వారి తల్లి,దండ్రులకు ఉన్న అనుమానాల్ని నివృత్తి చెయ్యాలనీ, లేనియెడల అన్ని కార్పొరేట్ విద్యా సంస్థల ను ముట్టడించి, తదుపరి కార్యచరణ చేపడతామని, సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.

## తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 11 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలను ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీ వర్సిటీ ఇంఛార్జి విసి నవీన్ మిట్టల్ విడుదల చేశారు. మొత్తం 96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం టీజీ ఎడ్‌సెట్ పరీక్షను మే 23న నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మొత్తం 29, 463 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా.. ఈసారి ఎడ్‌సెట్ పరీక్షలను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో మొత్తం 14, 285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ ఎడ్‌సెట్ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో మొత్తం 96.90 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఎడ్‌సెట్ పరీక్షకు 27,495 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26,994 అభ్యర్థులు (98.18శాతం ) ఉత్తీర్ణత సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే 23న రెండు సెషన్లలో టీజీఎడ్‌సెట్-2024 పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 16,929 మందికి గానూ 14,633 మంది, రెండో సెషన్ 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 87శాతం హాజరు శాతం నమోదైంది. ఈ ఏడాది నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎడ్‌సెట్ పరీక్షల బాధ్యత చేపట్టింది. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్ల బీఎడ్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో మొత్తం 14285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.